# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
సోమవారం
27 జులై
2026


# బీటీఎస్ అండర్‌పాస్...
# ప్రణాళిక లోపానికి ప్రజలే బలి

**సమయం, ఇంధనం, ప్రజాధనం వృథా..**

**ఇకనైనా బాధ్యులు స్పందించాలి**





**బిక్కనూర్, జూలై 26 (నినాదం) :** దోమకొండ, బీబీపేట మండలాలతో పాటు బిక్కనూర్ మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలు కామారెడ్డికి వెళ్లాలన్నా, అలాగే సిద్ధిపేట, సిరిసిల్ల జిల్లాల్లోని కొన్ని మండలాల నుంచి కామారెడ్డి వైపు ప్రయాణించాలన్నా బీటీఎస్ (దీూ) చౌరస్తా ప్రధాన మార్గంగా ఉపయోగపడుతోంది. ప్రతిరోజూ వందలాది ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఇంత కీలకమైన రహదారిలో నిర్మించిన అండర్‌పాస్ తగిన ఎత్తులో లేకపోవడంతో నేటికీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అండర్‌పాస్ ఎత్తు తక్కువగా ఉండటంతో ఆర్టీసీ బస్సులు దాని గుండా వెళ్లలేకపోతున్నాయి. తొలుత సమీపంలోని యూ-టర్న్ వద్ద రహదారి దాటే ప్రయత్నం చేశారు. అక్కడ తరచూ ప్రమాదాలు జరగడంతో ఆ మార్గాన్ని నిలిపివేశారు. అనంతరం కొంతకాలం జంగంపల్లి సాయిబాబా ఆలయం వరకు రాంగ్‌రూట్‌లో వెళ్లి రహదారి దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ కూడా ప్రమాదాలు జరగడంతో ప్రస్తుతం బస్సులు బిక్కనూర్ టోల్‌గేట్ వరకు వెళ్లి యూ-టర్న్ తీసుకుని తిరిగి ప్రయాణించాల్సి వస్తోంది. దీని వల్ల ఒక్కో బస్సు అదనంగా 5 నుంచి 6 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఫలితంగా ప్రయాణ సమయం పెరగడంతో పాటు డీజిల్ వినియోగం కూడా అధికమవుతోంది. ప్రతిరోజూ వందలాది బస్సులు ఇదే విధంగా అదనపు దూరం ప్రయాణిస్తుండటంతో నెలలు, సంవత్సరాల లెక్కన చూస్తే వేల లీటర్ల ఇంధనం, గణనీయమైన ప్రజాధనం అనవసరంగా ఖర్చవుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రయాణికులు కూడా తమ గమ్యస్థానాలకు ఆలస్యంగా చేరుకోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. అండర్‌పాస్ నిర్మించే ముందు బస్సులు, లారీలు వంటి భారీ వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని సరైన ప్రణాళికతో నిర్మించి ఉంటే ఈ సమస్య తలెత్తేది కాదని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రణాళికలో లోపాలు ఉండటమే ఈ సమస్యకు ప్రధాన కారణమని స్థానికులు భావిస్తున్నారు. అభివృద్ధి అంటే కేవలం నిర్మాణాలు పూర్తి చేయడం మాత్రమే కాకుండా, ప్రజలకు ఉపయోగపడేలా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులు కల్పించడం కూడా ముఖ్యమని, ప్రణాళికలో లోపాలు ఉంటే వాటి ప్రభావం ప్రజలపై చాలా కాలం పడే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. బిక్కనూర్, దోమకొండ, బీబీపేట మండలాలతో పాటు కామారెడ్డి, సిద్ధిపేట, సిరిసిల్ల జిల్లాలకు వెళ్లే అనేక మంది ఈ మార్గాన్నే ఉపయోగిస్తున్నారు. ప్రతిరోజూ వందలాది ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు అదనంగా 5 నుంచి 6 కిలోమీటర్లు తిరగాల్సి వస్తోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, జాతీయ రహదారుల సంస్థ కలిసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా జాతీయ రహదారుల సంస్థ (చీనాా×), సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, రాష్ట్ర రవాణా శాఖ ఈ సమస్యను అత్యవసరంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. అండర్‌పాస్‌ను తగిన ప్రమాణాలకు అనుగుణంగా మార్చడం లేదా ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు సురక్షితంగా వెళ్లే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం ద్వారా ప్రజల సమయం, ఇంధనం, ప్రజాధనం ఆదా చేయవచ్చని వారు తెలియచేస్తున్నారు. ప్రతిరోజూ అనేక మంది ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ సమస్యపై సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రోడ్లు, బ్రిడ్జిలు ప్రజల సౌకర్యం కోసం నిర్మిస్తారు. కానీ ఈ అండర్‌పాస్ వల్ల మా కష్టాలు పెరిగాయి. ప్రణాళికలో చిన్న లోపం కారణంగా ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ వందలాది బస్సులు అదనపు దూరం తిరగాల్సి రావడంతో సమయం, ఇంధనం, ప్రజాధనం వృథా అవుతున్నాయి. మౌలిక వసతుల నిర్మాణంలో ముందుచూపు తప్పనిసరి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

**సుదర్శనం రాజయ్య,**
**విశ్రాంత ఉద్యోగి, గ్రామం దోమకొండ**



అత్యవసర పనుల కోసం తరచూ కామారెడ్డికి వెళ్లాల్సి వస్తుంది. కానీ అండర్‌పాస్ సమస్య కారణంగా టోల్‌గేట్ వరకు వెళ్లి తిరిగి రావాల్సి వస్తుండటంతో విలువైన సమయం వృథా అవుతోంది. రైతులతో పాటు ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

**మోతె మల్లారెడ్డి, రైతు,**
**గ్రామం కాచాపూర్**



ఉద్యోగానికి వెళ్లి రావడానికి ప్రతిరోజూ ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తాము, అండర్‌పాస్ సమస్య వల్ల టోల్‌గేట్ వరకు వెళ్లి తిరిగి రావాల్సి వస్తోంది. ఒక్కోసారి టోల్‌గేట్ వద్ద భారీగా వాహనాలు ఉండటంతో లైన్‌లోనే చాలా సేపు వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో సమయం, ఇంధనం వృథా అవుతున్నాయి. అధికారులు త్వరగా స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలి.

**సురేష్ కుమార్, ప్రైవేట్ ఉద్యోగి,**
**గ్రామం, పెద్దమల్లారెడ్డి**



ఈ అండర్‌పాస్ సమస్య వల్ల ప్రతిరోజూ కళాశాలకు సమయానికి చేరుకోవడం కష్టంగా మారింది. బస్సులు అదనపు దూరం తిరగాల్సి రావడంతో ఆలస్యమవుతోంది. పరీక్షలు, ముఖ్యమైన తరగతులకు కూడా సమయానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ ప్రణాళిక లోపం వల్ల విద్యార్థుల సమయం వృథా అవుతోంది. అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

**శ్రీకర్, డిగ్రీ విద్యార్థి, గ్రామం కంచర్ల**

# లయన్స్ క్లబ్ సేవా తరుణి ఆధ్వర్యంలో గోరింటాకు సంబరాలు





**తొర్రూర్, జూలై 26(నినాదం ):** భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస గోరింటాకు సంబరాలను లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ సేవా తరుణి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు సంప్రదాయ చీరలు ధరించి, గోరింటాకు అలంకరణలతో ఉత్సాహంగా పాల్గొని ఆషాఢ మాస విశిష్టతను ప్రతిబింబించారు. మహిళలందరూ పరస్పరం గోరింటాకు పెట్టుకుని ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. చిన్నారులు కూడా పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం, మహిళల్లో ఐక్యతను పెంపొందించడం కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలను ర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు శుభాకాంక్షలు తెలియజేసి, గోరింటాకు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అందరూ కలిసి సాంస్కృతిక వాతావరణంలో వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ములకలపల్లి, జూలై 26 (నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి 2010--11 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా నిర్వహించబడింది. మొత్తం 95 మంది పూర్వ విద్యార్థుల్లో 60 మంది హాజరై తమ విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాల అనుభవాలు, ఉపాధ్యాయుల సేవలు, జీవితంలో సాధించిన విజయాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించి, సేవలను కొనియాడారు. స్నేహితులంతా పరస్పరం ఆప్యాయంగా కలుసుకొని పాత అనుబంధాలను మరింత బలోపేతం చేసుకున్నారు. సమ్మేళనం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన నిర్వాహక కమిటీ సభ్యులను పూర్వ విద్యార్థులు అభినందించారు. భవిష్యత్తులో మరింత మంది పూర్వ విద్యార్థుల భాగస్వామ్యంతో ఇలాంటి సమ్మేళనాలను నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆహ్వానితులు పాల్గొన్నారు.

# సిపిఐ 'ఏంఎల్ మాస్ లైన్'లోకి పలు కుటుంబాలు చేరికలు

**పార్టీ కండువ కప్పి ఆహ్వానించిన డివిజన్ కార్యదర్శి ప్రభాకర్**



**దమ్మపేట, జూలై 26(నినాదం):** మండల పరిధిలోని మల్లారం కాలనీకి చెందిన పలు కుటుంబాలు సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా మల్లారం కాలనీలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ సిద్ధాంత నిబద్ధత కలిగిన పార్టీ అని పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న మత ఉన్మాదం, ఫాసిజం లాంటి ధోరణులను ఎదుర్కోవాలంటే బలమైన విప్లవ పార్టీల అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ పార్టీ పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు పండూరి వీరబాబు, పీఓడబ్ల్యూ నాయకురాలు గంగాధర నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**: జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు**

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 26(నినాదం) :** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం, పంటల దిగుబడులను పెంచడం లక్ష్యంగా నిర్వహిస్తున్న "విత్తన మేళా-2026" కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ, ఎల్-నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని, వ్యవసాయ శాఖ సూచించిన పంటల సాగుకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం గుర్తించిన విత్తన విక్రయ కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేపడితే మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మండలాల వారీగా ఏర్పాటు చేసిన విత్తన విక్రయ కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, విత్తనాల ప్యాకెట్‌పై బ్యాచ్ నంబర్, గడువు తేదీ, మొలక శాతం వంటి వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. రైతులు తమ ప్రాంతంలోని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి స్థానిక పరిస్థితులకు అనువైన పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. కంది, పెసర, మినుము, శనగ, జొన్న, సజ్జ, కొర్రలు వంటి పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. నకిలీ విత్తనాల బారిన పడకుండా ప్రభుత్వం గుర్తింపు పొందిన లైసెన్స్ కలిగిన విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన బిల్లులను భద్రపరచుకోవాలని సూచించారు. విత్తనాలకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా ఫిర్యాదులు ఉంటే వెంటనే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతు లి"విత్తన మేళా-2026"లిను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు ఆకాంక్షించారు.

# తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**ప్రొ. కోదండరాంకు**
**పి ఆర్ టి యు టి ఎస్ వినతి**

**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 26(నినాదం) :** తెలంగాణ ఉద్యమానికి సారథ్యం వహించి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం కాగజ్ నగర్ కు రాగా పి ఆర్ టి యు టి ఎస్ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా శాఖ ఘన స్వాగతం పలికింది. ఈ సందర్భంగా జిల్లా శాఖ అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రొ. కోదండరాం పిలుపు మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయులు గ్రామ గ్రామాన ఉద్యమాన్ని తీసుకెళ్లి కార్యక్రమాలను విజయవంతం చేశారని, రాష్ట్ర సాధనలో భాగస్వాములు కావడం తమ బాధ్యతగా భావించామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం అభినందనీయమని తెలిపారు. అయితే ప్రస్తుతం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ప్రొ. కోదండరాంను కోరారు. మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను వెంటనే అమలు చేయాలని, ఆరు కరువు భత్యాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం ను పునరుద్ధరించాలని కోరారు. అలాగే కేజీబీవీ, ఐటీడీఏ, ఎంజెపి, సోషల్ వెల్ఫేర్, గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించి, మినిమం టైమ్ స్కేల్ మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



# పేదోడి ఆపిల్.. సీతాఫలం

**ఉచితంగా లభించే ఏకైక ఫలం..**

**రెక్కల కష్టంపై ఆధారపడి జీవించే గిరిజనులకు ఉపాధి**



**ఆమనగల్లు,జూలై 26(నినాదం) :** ప్రతి ఏటా వర్షాకాలంలో చెరువులు, గుట్టల ప్రాంతాల్లో ఉచితంగా లభించే ఏకైక ఫలం సీతాఫలం. చిన్న, పెద్ద తేడాలేకుండా ప్రతి ఒక్కరూ తినే మధుర ఫలం. పేదోడి ఆపిల్గా పిలువబడే సీతాఫలం మాట వింటేనే నోరూరుతుందని, పండులో తియ్యదనంతో పాటు పోషకాలు విరివిగా ఉండడంతో ప్రతి సీజన్ లో ప్రతి ఒక్కరూ సీతాఫలాలు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇవి తింటే మనిషి శరీరంలో రోగ నిరోధక శక్తి పెరగడమే కాక దీర్ఘకాలిక రోగాలను అదుపు చేసే శక్తి సైతం కలుగుతదని వారు పేర్కొన్నారు. నోరూరించే మధుర ఫలాలురానే వచ్చేశాయి. అతితక్కువ ధరకు లభించే సీతాఫలాలకు ఈ సీజన్ లో వర్షాలు సమృద్ధిగా పండడంతో ఫలాలు దిగుమతి పెరిగింది. సీతా ఫలాల సీజన్ రావడంతో మార్కెట్లో లో జోరుగా విక్రయిస్తున్నారు. రహదారుల వెంట గంపలు గంపలుగా విక్రయిస్తున్నారు. ఒక్కో సీతాఫలం పది నుంచి ఇరవై ఐదు రూపాయల వరకు ధర పలుకుతున్నాయి. పండ్ల బుట్ట వెయ్యి రూపాయల వరకు పలుకుతున్నది. సీతాఫలాల కాయల బుట్ట సైతం ఐదువందల నుంచి ఏడువందల రూపాయల దాక పలు కుతున్నది. అయినప్పటికీ మధురఫలా ల్లో పోషకాలు ఉండటంతో జనం కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురవడంతో సీతాఫలాలు విరివిగా పండాయి. తండాలు, గ్రామాలకు చెందిన గిరిజను లు, ఇతర కూలీలు అటవీ ప్రాంతాలు, గ్రామ శివారు ప్రాంతాల్లోకి వెళ్లి సీతాఫలాలు తెంపి పట్టణాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రస్తుత సమయంలో ఉపాధి అవకాశాలు పెద్దగా లేకపోవడంతో రెక్కల కష్టంపై ఆధారపడి జీవించే కూలీలకు సీతాఫలాల సేకరణ ఉపాధిగా మారింది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ అటవీ భూములు ఎక్కువగా ఉండడంతో ప్రత్యేకంగా గిరిజనులు సీతాఫలాల సేకరణ చేపట్టి ఉపాధి పొందుతున్నా రు. సేకరించిన సీతాఫలాలను అమనగల్లు నుంచి కడ్తాల వరకు జాతీయ రహదారిపై బుట్టలో పెట్టి విక్రయాలు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. రహదారిపై బుట్టలో అలంకరించి పెట్టిన సీతాఫలాలను చూస్తే చూపరులను ఆకట్టుకుంటున్నాయి. రోడ్డుపై శ్రీశైలం వెళ్లే వాహనదారులు వాటిని కొనుగోలు చేసి తీసుకువెళ్తుండడంతో కూలీలకు ఆసరాగా మారింది. కోతుల బెడదతో దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు.



# కాంగ్రెస్ హామీలు కాగితాలకే పరిమితం..

**ప్రజా సమస్యలపై జనసేన పోరాటం**
**కొనసాగుతుంది: డా. గడల శ్రీనివాసరావు**





**కొత్తగూడెం, జూలై 26(నినాదం) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి పాలన సాగిస్తోందని జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు, రాష్ట్ర చేరికల కమిటీ సభ్యుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ డా. గడల శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం కొత్తగూడెంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారమే జనసేన పార్టీ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగడానికి పార్టీ క్షేత్రస్థాయిలో నిరంతరం పోరాటాలు చేస్తోందని చెప్పారు. రానున్న అన్ని ఎన్నికల్లో పోటీ చేసి జనసేన సత్తా చాటుతుందని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన 42 పేజీల మేనిఫెస్టోలోని వందలాది హామీల్లో కనీసం 20 శాతం కూడా అమలు కాలేదని ఆరోపించారు. రైతుల సమస్యలు, నిరుద్యోగం, మహిళల భద్రత, యువత ఉపాధి వంటి కీలక అంశాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. యూరియా యాప్ అమలులో ఉన్న లోపాల వల్ల రైతులు ఇబ్బం దులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా నియంత్రణ చర్యలు, ఫాగింగ్, దోమతెరల పంపిణీ వంటి అంశాల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని, ఇదే పరిస్థితి కొనసాగితే ఆరోగ్య అత్యవసర పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందనీ హెచ్చరించారు. పోడు భూముల సమస్యపై ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, జీవనోపాధి కోసం సాగు చేస్తున్న గిరిజనులను వేధించడం అన్యాయమని అన్నారు. యువత, మహిళలు, నిరుద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారంలో పురోగతి కనిపించడం లేదని, కొత్త పరిశ్రమలు తీసుకురాకపోవడంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని విమర్శించారు. కేటీపీఎస్ రెండో దశను ఏర్పాటు చేయాలని, సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగూడెం ఎమ్మెల్యే ప్రభుత్వానికి సహకరించడం మినహా ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేయడం లేదని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో మంచి పాలన, పారదర్శక పరిపాలనే జనసేన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 2న దమ్మపేటలో నిర్వహించనున్న జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించి, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన రాష్ట్ర నాయకులు రాము యాదవ్, జిల్లా ఇన్‌చార్జ్ మిరియాల రామకృష్ణ, జిల్లా నాయకులు సాదిక్, వీర మహిళ దివ్య, సౌజన్య, తాటికొండ ప్రవీణ్, వేణు, రహీం, ఉషికల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం, తెలంగాణ

27 జూలై 2026


## సాయిబాబా నగర్ డివిజన్‌లో మంజీరా పైప్‌లైన్ జంక్షన్ నిర్మాణ పనులు ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, జులై 26 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 292వ డివిజన్ సాయిబాబా నగర్‌లో మంజీరా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో చేపట్టిన పైప్‌లైన్ జంక్షన్ పాయింట్ నిర్మాణ పనులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొన్ని నెలలుగా సాయిబాబా నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న మంజీరా తాగునీటి సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో 50 లక్షల హెచ్ డి ఎఫ్ నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఆ నిధులతో జంక్షన్ పాయింట్ నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పనులు పూర్తయిన అనంతరం సాయిబాబా నగర్ డివిజన్‌లో మంజీరా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, మూడు రోజులకు ఒకసారి ప్రతి ఇంటికీ మంజీరా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికిరణ్, డీసీసీ జనరల్ సెక్రటరీ సొమ్మన్న గారి శ్రీధర్ రెడ్డి, సినియర్ కాంగ్రెస్ నాయకులూ భాస్కర్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ కరణ్, చందు, నాగేష్ రెడ్డి, రామచందర్, నరసింహారెడ్డి, సత్తి రెడ్డి, నందగోపాల ప్రసాద్, గఫార్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## జి ఎస్‌బి పరిశ్రమ లో విషాదం

**అనుమానస్పద స్థితిలో కార్మికుడు మృతి**

**గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో బొంతపల్లి పరిశ్రమిక వాడలో విషాదం చోటుచేసుకుంది**




**జిన్నారం /గుమ్మడిదల, జులై 26 (నినాదం):** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక వాడలో విషాదం చోటుచేసుకుంది. జీఎస్‌బీ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న రాజు ప్రసాద్(58) అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. కార్మికుడు ఒక్కసారిగా కింద పడిపోవడంతో వెంటనే పరిశ్రమ యాజమాన్యం ఆయనను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతదేహంతో జీఎస్‌బీ పరిశ్రమ ప్రధాన గేటు ముందర కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పరిశ్రమలోని పని పరిస్థితుల కారణంగానే రాజు ప్రసాద్ మృతి చెందారని ఆరోపిస్తూ, ఘటనపై సమగ్ర విచారణ జరిపి తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్ ప్రభుత్వాన్ని,పరిశ్రమ యాజమాన్యాన్ని కోరారు.

## సాయి బృందావన్ కాలనీ ప్రెసిడెంట్ గా జోగిరాజు



**అల్వాల్, జూలై 26 (నినాదం):** సాయిబృందావన్ కాలనీ నూతన కార్యవర్గమున ఎన్నుకున్నారు. కాలనీ ప్రెసిడెంటుగా జోగి రాజును ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎలక్షన్ కమిటీ వారు తెలిపారు. జనరల్ సెక్రెటరీగా జే రఘుపతి రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా రాజు రెడ్డి,వినయ్ కుమార్, ట్రెజరర్ గా ఎం శ్రీనాథ్,జాయింట్ సెక్రటరీలుగానవీన్ కుమార్, రాజ్ గోపాల్ రావు లను ఎన్నుకున్నారు. ఎన్నికైన ప్రెసిడెంట్ జోగిరాజు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ప్రెసిడెంట్గాఎన్నుకున్నందుకు కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరితో కలిసి మెలిసి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

## శ్రీ వేదాంతం నరసింహమూర్తిని ఘనంగా సత్కరించిన నాయకులు



**నాచారం, జులై 26 ( నినాదం ) :** నాచారం శ్రీ మహాకాళి సహిత మహాకాళేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ వేదాంతం నర్సింహామూర్తి ఆలయంలో సేవలు అందించడం నేటికీ 50 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా వారి సేవల అర్ధ శతాబ్ది మహోత్సవ వేడుకలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో విశేషంగా నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో నాయకులు పాల్గొనడం జరిగింది. ?ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ వేదాంతం నరసింహమూర్తి ని శాలువాతో ఘనంగా సత్కరించి, వారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. అనంతరం భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించటం జరిగింది. అమ్మవారి ఆలయంలో అర్చకులు వేదాంతం నర్సింహా మూర్తి సేవలను ప్రజలు కొనియాడారు. వారి సేవలు ఆలయంలో ఇంకా ఎన్నో విధాలుగా అందించాలని ప్రజలు కోరారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తజన సమూహానికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ వేదాంతం నరసింహమూర్తి ఆధ్వర్యంలో బృహత్ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు.

# సుస్థిర స్వీయ–పునరుద్ధరణ కాంక్రీటుపై పరిశోధనకు పీహెచ్. డీ.



**పటాన్చెరు, జూలై 26 (నినాదం):** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి సయ్యద్ రియాజ్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'సుస్థిర నిర్మాణం కోసం బాసిల్లస్ సబ్టిలిస్ బాక్టీరియాను జోడించి స్వీయ–పునరుద్ధరణ కాంక్రీటు సూక్ష్మ నిర్మాణ విశ్లేషణపై ప్రయోగాత్మక పరిశోధన' చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అసోసి యేట్ ప్రొఫెసర్ డాక్టర్ హేమరాజు పొల్లాయి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ డాక్టరల్ పరిశోధన, స్వీయ–పునరుద్ధరణ కాంక్రీటులో బాసిల్లస్ సబ్టిలిస్ బాక్టీరియా యొక్క వినూత్న అనువర్తనాన్ని అన్వేషించినట్టు తెలిపారు. ప్రయోజనకరమైన బాక్టీరియాను చేర్చడం ద్వారా కాంక్రీటు సూక్ష్మ పగుళ్లను స్వయంగా ఎలా బాగు చేసుకోగలదో, తద్వారా దాని మన్నికను గణనీయంగా పెంచి, నిర్మాణాల సేవా జీవితాన్ని పొడిగించి, నిర్వహణ ఖర్చులను ఎలా తగ్గించగలదో ఈ పరిశోధన నిరూపించిందన్నారు. బాక్టీరియా స్వీయ–పునరుద్ధరణ సాంకేతికత, కాంక్రీటు యొక్క దీర్ఘకాలిక పనితీరును, స్థితిస్థాపకతను మెరుగుపరుస్తుందని, అదే సమయంలో పర్యావరణ సుస్థిర, పర్యావరణ అనుకూల నిర్మాణ పద్ధతులను ప్రోత్సహిస్తుందని ఈ అధ్యయనం బలమైన శాస్త్రీయ ఆధారాలను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ పరిశోధన ఫలితాలు, మన్నిక, సుస్థిరతను మిళితం చేసే తదుపరి తరం నిర్మాణ సామగ్రి అభివృద్ధికి విలువైన తోడ్పాటును అందిస్తాయని భావిస్తున్నట్టు తెలియజేశారు. ఈ పరిశోధన స్వీయ–పునరుద్ధరణ కాంక్రీట్, అధునాతన నిర్మాణ సామగ్రి, సుస్థిర మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగాలలో భవిష్యత్ అధ్యయనాలకు ఒక ముఖ్యమైన సూచనగా ఉపయోగపడుతుందని విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. ఇది ఆవిష్కరణ, శాస్త్రీయ నైపుణ్యం ద్వారా వాస్తవ ప్రపంచ ఇంజనీరింగ్ సవాళ్లను పరిష్కరించే అధిక–ప్రభావ పరిశోధనను ప్రోత్సహించాలనే గీతం నిబద్ధతను కూడా బలపరుస్తోందన్నారు. డాక్టర్ సయ్యద్ రియాజ్ సిద్ధాంత వ్యాసం పీహెచ్. డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ. ఎస్. రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర సీహెచ్. అఖిలేష్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించడమే గాక, పరిశోధన పట్ల ఆయన అంకితభావాన్ని ప్రశంసించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ రియాజ్ కృషి సుస్థిర నిర్మాణ సాంకేతికతలకు అర్థవంతమైన తోడ్పాటును అందిస్తుందని, అలాగే ఈ రంగంలోని భవిష్యత్ పరిశోధకులకు స్ఫూర్తినిస్తుందని వారు విశ్వాసం వ్యక్తం చేసినట్టు తెలిపారు.

## ఘనంగా శ్రీ సద్గురు సేవాలాల్ బోగ్ బండార్ ,సీత్ల పండుగ





**ఆమనగల్లు, జూలై 26(నినాదం):** కడ్తాల్ మండలం, బోయినుట్ట తాండ: బంజారా సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ బోగ్ బండార్ మరియు సీతల మాత పండుగ వేడుకలు బోయినుట్ట తాండలో భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, సంప్రదాయ ఆచారాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్, సీతల మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారో గ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని, బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలు సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ మాజీ సర్పంచ్ లాలికోట నరసింహ, వార్డు సభ్యులు అంజి నాయక్,సోమ్లా నాయక్,గణేష్ నాయక్,కిషన్ నాయక్,రాములు నాయక్, ఠాగూర్ చంద్రు శ్రీను, ఈశ్వర్,రవి,సాబీర్, జంగయ్య, హనుమంతు, బాలాజీ, ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు,యువకులు, మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేశారు,భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

## కాలనీలో మోరీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం..

- పిచ్చి మొక్కలతో కాలనీవాసుల అవస్థలు



**రేవల్లి జులై 26 (నినాదం):** వనపర్తి జిల్లా వల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మోరీలు అపరిశుభ్రంగా మారి చెత్తాచెదారం పేరుకుపోవ డంతో పాటు పిచ్చి మొక్కలు విస్తారంగా పెరిగాయి. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా రోజులుగా మోరీలను శుభ్రం చేయక పోవడంతో మురుగునీరు సరిగా వెళ్లకుండా నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మోరీల్లో పేరుకుపోయిన చెత్త కారణంగా దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి విషజ్వరాలు, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వారు చెబుతున్నారు. పిచ్చి మొక్కలు పెరిగి మోరీలను పూర్తిగా కప్పేయడంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసే సమయంలో మురుగునీరు ఇళ్ల ముందుకు చేరి పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి మోరీల్లో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించి, పిచ్చి మొక్కలను తొలగించి, మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఎస్సీ కాలనీవాసులు కోరుతున్నారు. అలాగే కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను శాశ్వతంగా మూసివేయాలి

- లక్షలాదిమంది కదం తొక్కితేనే డంపింగ్‌యార్డ్ మూసివేత సాధ్యం
- పర్యావరణ వేత్త సైంటిస్ట్ డాక్టర్ బాబురావు





**జవహర్ నగర్, జులై 26 (నినాదం):** ప్రజలకు ప్రాణ సంకటంగా మారిన జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను శాశ్వతంగా మూసివేయాలని లక్షలాదిమంది కదం తొక్కితేనే డంపింగ్ యార్డ్ మూసివేత సాధ్యమని ప్రముఖ పర్యావరణవేత్త సైంటిస్ట్ డాక్టర్ బాబురావు పిలుపునిచ్చారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ యాప్రాల్ డిఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి కన్వీనర్ ఉమా మహేష్ అధ్యక్షతన డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా ఆదివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ పర్యావరణ సైంటిస్ట్ డాక్టర్ బాబురావు హాజరై మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని నాలుగు మండలాల ప్రాంతాల ప్రజలకు ప్రమాదకరమైన రాంకీ డంపింగ్ యార్డ్ ఎత్తివేత సాధ్యం కాదని పూర్తిగా మూసివేయాలని నగర పరిధిలోని బయటి చెత్తను ఇకమీదట జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కు తరలించకూడదని ప్రముఖ పర్యావరణ సైంటిస్ట్ డాక్టర్ బాబురావు పేర్కొన్నారు. జవహర్ నగర్ పరసల ప్రాంతాల చెత్తను మాత్రమే డంపు చేసుకుంటామని మిగతా ప్రాంతాల నుండి తరలించే చెత్త ఇక్కడికి తీసుకువచ్చి డంపు చేయవద్దని సూచించారు. ఏ ప్రాంతాల చెత్త ఆ ప్రాంతాల వారు డంపు చేసుకునేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ సర్వత్ మాట్లాడుతూ సుమారు 30 లక్షల మంది ప్రజలను అభివృద్ధి నమ్మించి మోసగించే మాటలను ఇక నమ్మకూడదని తెలిపారు. ప్రముఖ పర్యావరణ వేత్త సర్వత్ మాట్లాడుతూ హైదరాబాద్ నగర్ నలుమూలల నుంచి తరలించే చెత్తను జవహర్ నగర్ ప్రాంతంలో నివసించే సామాన్య పేద మధ్యతరగతి ప్రజల తలలపై గుమ్మరించడం దుర్మార్గమన్నారు. ప్రజల జీవించే హక్కును కాలరాయడం భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగకరమని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి శాస్త్రవేత్తలు విద్యావేత్తలు హక్కులనేతల సూచనలను పరిగణలోకి తీసుకొని రాంకీ చెత్త డంపింగ్ యార్డ్ ను పూర్తిగా మూసివేయాలని డిమాండ్ చేశారు. లేని ఎడల జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరిగే పోరాటాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. డంపింగ్ యార్డ్ గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ పెద్దలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోసు, నరసింగరావు, రమ, బొల్లినేని ప్రకాష్, కాంగ్రెస్ నేతలు గజ్జలకాంతం, మేడ్చల్ జిల్లా పిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ మేకల కావ్య, జాతీయ నాయకురాలు సంధ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ నాయకురాలు విమలక్క, ఓయూ ప్రొఫెసర్ సి. కాసిం, టిఆర్ఎస్ జాగృతి గొంగల్ల రంజిత్ కుమార్, బుర్ర రాముగౌడ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, ఉపసర్పంచ్ నరసింహ, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, కొండల ముదిరాజ్, ఆలూరు రాజశేఖర్, కల్లేపల్లి సదానంద్, అనురాధ, మల్లేష్, గౌడుగు వేణు, మేక లలిత యాదవ్, బండకింది సింగరయ్య గౌడ్, బూడిద వెంకటేష్, రాజనర్సింహ, జాన్, వెంకటాచారి, తదితర కళాకారులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## పోస్ట్ ఆఫీస్ ఖాతాల ప్రచారంతో పింఛన్‌దారుల్లో ఆందోళన




**హుజుర్నగర్ (మఠంపల్లి) జూలై 26(నినాదం):** పోస్ట్ ఆఫీస్ ఖాతాల ప్రచారంతో పింఛన్దారుల్లో ఆందోళన కలుగుతుందని వారు తెలిసి తెలియక అనవసర ఖర్చులు చేస్తున్నారని అలా చేయడం వల్ల పింఛన్దారులపై ఆర్థిక భారం పడుతుందని గాయం గోవర్ధన్ రెడ్డి విచార వ్యక్తం చేశారు. సామాజిక భద్రతా పింఛన్లు ఆసరా,చేయూత పొందుతున్న లబ్ధిదారులకు పోస్ట్ ఆఫీస్‌లో ఖాతా తప్పనిసరిగా తెరవాలనే సోషల్ మీడియా ప్రచారం నేపథ్యంలో పింఛన్‌దారుల్లో ఆందోళన నెలకొంది. ఈ ప్రచారాన్ని నమ్మి పలువురు పోస్ట్ ఆఫీస్ ఖాతాల కోసం దరఖాస్తు చేస్తున్నట్లు సమాచారం. ఖాతా ప్రారంభానికి రూ. 500, కొత్త పాన్ కార్డు, ఇతర అవసరమైన పత్రాల జిరాక్స్ ఖర్చులు కలిపి ఒక్కో లబ్ధిదారుపై సుమారు రూ. 1,000 వరకు అదనపు భారం పడుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారిక ఆదేశాలు లేకుండానే ఈ ప్రక్రియ చేపట్టడం వల్ల వృద్ధులు, వికలాంగులు, వితంతువులు వంటి పింఛన్‌దారులు జిరాక్స్ సెంటర్లు చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు గాయం గోవర్ధన్ రెడ్డి పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు వెలువడలేదు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలను నమ్మి లబ్ధిదారులు అనవసర ఖర్చులు చేయకుండా, సంబంధిత అధికారులు వెంటనే అధికారిక ప్రకటన విడుదల చేసి వాస్తవ పరిస్థితిని స్పష్టం చేయాలని పింఛన్‌దారులు కోరుతున్నారు. అలాగే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఈ అంశంపై ప్రజలకు సరైన అవగాహన కల్పించి అనవసర గందరగోళాన్ని నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కార్మిక హక్కులను కాపాడే ఏకైక సంఘం ఏ ఐ టి యు సి: పానుగంటి పర్వతాలు




**రాజేంద్రనగర్, జులై 26 (నినాదం):** దేశంలో శ్రమజీవుల హక్కులను కాపాడే ఏకైక కార్మిక సంఘం ఏఐటీయుసి మాత్రమేనని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు స్పష్టం చేశారు. ఆదివారం ఎం. శంకరయ్య అధ్యక్షతన జరిగిన గండిపేట మండల 4వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడులను తీసుకురావడం వల్ల కార్మిక చట్టాలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు కాకపోవడం, పెరిగిన నిత్యావసర ధరలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. భవిష్యత్తు కార్యచరణ ఆగస్టు 2న తుక్కుగూడలో జరిగే మహాసభల్లో కార్మికుల సమస్యలపై తీర్మానాలు చేసి, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు.

**నూతన కమిటీ ఎన్నిక:**

సభ అనంతరం 15 మందితో కూడిన గండిపేట మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.

గౌరవాధ్యక్షుడు: ఎం. శంకరయ్య, అధ్యక్షుడు: శివ, కార్యనిర్వాహక అధ్యక్షుడు: భాస్కర్, మండల ప్రధాన కార్యదర్శి: వెంకటేష్. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి ఎస్. మల్లేష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బాలాజీ నగర్‌ను జల్లెడ పట్టిన పోలీసులు..

**26 వాహనాలు స్వాధీనం**



**కోదాడ,జూలై ,26(నినాదం):** కోదాడ పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఆదివారం పోలీసులు భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 25 మోటార్‌సైకిళ్లు, ఒక కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో కోదాడ సబ్‌డివిజన్ పరిధిలోని ఇద్దరు సీఐలు, ఎనిమిది మంది ఎస్‌ఐలు, 80 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లుగా ఆయన తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలు, నేరాల నియంత్రణే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కొత్త వ్యక్తులకు గుర్తింపు పత్రాలు లేకుండా ఇళ్లను అద్దెకు ఇవ్వొద్దని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే డయల్ 100, 112లేదా సైబర్ హెల్ప్‌లైన్ 1930కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## బోల్తా పడిన కారులో మంటలు..

**తృటిలో తప్పిన ప్రాణాపాయం**





**కోదాడ జూలై 26(నినాదం):** కోదాడ సమీపంలోని విజయవాడ--హైదరాబాద్ జాతీయ రహదారిపై మద్రాస్ కేఫ్ సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళు తున్న కారు అదుపుతప్పి బోల్తా పడడంతో ఇంజిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు, ఇతర వాహనదారులు వెంటనే స్పందించి కారులో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదం కారణంగా కొద్దిసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. విజయవాడ నుంచి యాదగిరిగుట్టకు దైవదర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సోమవారం । తెలంగాణ
27 జులై 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## యూనియన్ ప్రభుత్వంపై విజయం సాధించిన యువతకు విప్లవ జేజేలు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**అమరచింత, జూలై 26, (నినాదం):** అమరచింత మండల కేంద్రంలోని జి. ఎస్. భవన్ లో ఏర్పాటు చేసినా విలేకర్ల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ ఈ గొప్ప విజయం సాధించిన దేశ విద్యార్థులకు, యువతకు అభినందనలు తెలిపారు. దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనేది కేవలం మొదటి అడుగు మాత్రమే. ఇప్పుడు ఎన్టిఎను రద్దు చేయాలి. అలాగే విద్యార్థి వ్యతిరేక, వాణిజ్యపరమైన, మతతత్వ ధోరణి కలిగిన ఎన్ఇపి–2020ని కూడా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనకారులపై బనాయించిన కేసులను ఎత్తివేయాలని, మన విద్యార్థులపై అమానుషంగా దాడి చేసిన పోలీసు సిబ్బంది అందరిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. 'అభిజీత్ దీప్కే, సోనమ్ వాంగ్‌చుక్, ఎస్ఎఫ్ఐ నేతలతో సహా పోరాటం మార్గంలో దృఢంగా నిలిచి, అన్ని రకాల బెదిరింపులను ధైర్యంగా ఎదుర్కొన్న విద్యార్థి సంఘాలన్నింటికీ కూడా అభినందనలు చెబుతూ. క్రీడలు, కళలు, సినిమా, సంస్కృతి వంటి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ ఉద్యమానికి మద్దతుగా నిలవడం ఎంతో సంతోషకరం. ఐక్య పోరాటాలు విజయాన్ని సాధిస్తాయని ఈ అనుభవం మనకు తెలియజేస్తోందని అన్నారు. యువత డిమాండ్లన్నీ నెరవేరే వరకు అందరు దృఢంగా ఉంటూ పోరాటాన్ని కొనసాగించాలని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు కార్యదర్శి వర్గ సభ్యులు జబ్బార్ సీనియర్ నాయకులు ఎండి మహమూద్ మండల కార్యదర్శి జిఎస్ గోపి మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటేష్, అజయ్, టీ.రాఘవేంద్ర మండల కమిటీ సభ్యులు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగం వైభవంగా తీజ్ వేడుకలు..



**పాలేరు జూలై 26( నినాదం):** నేలకొండపల్లి మండలం లోని మంగాపురంతండా లో ఆదివారం తీజ్ పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముగింపు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. డీజే ఆటా, పాటలతో గిరిజన సాంప్రదాయ వస్త్రాలతో నృత్యాలు చేశారు. మేళతాళాలతో డప్పు వాయిద్యాలతో ఘనంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. ముగింపు సందర్భంగా దేవాలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. పంచాయతీ సర్పంచ్ ధీరావత్ ఆశోకరాణి–ధీరావత్ రాధాకృష్ణమూర్తి దంపతులు అమ్మవారికి వస్త్రాలు సమర్పించి, మొక్కులు చెల్లించగానే.. అదేసమయంలో వర్షం పడటంతో గిరిజనుల సంబురాలు అంబరాన్నింటాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గోబ్రియా 'నాయక్, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, సీతా నాయక్, గిరి నాయక్, గిల నాయక్, కోటేశ్వరరావు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## దశదిన కర్మలో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా నేత సోయం వీరభద్రం..

### 11 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేత..



**దమ్మపేట, జూలై 26(నినాదం):** పినపాక నియోజకవర్గం అశ్వాపురం మండలం వెంకటాపురం గ్రామంలో సోయం వంశీయుల తలపతి సోయం శ్రీనివాస్ దశదినకర్మ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం ముఖ్య అతిథిగా హాజరై శ్రీనివాస్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘన నివాళులర్పించారు. అనంతరం వీరభద్రం మాట్లాడుతూ.. సోయం శ్రీనివాస్ అకాల మరణం తీవ్రంగా కలచివేసిందని, వారి కుటుంబానికి ఇది తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. సోయం వంశీయులు సేకరించిన రూ.11,000/– నగదును సోయం కోటేశ్వరరావు సమక్షంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. శ్రీనివాస్ కుటుంబానికి సోయం వంశీయులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోయం సత్యనారాయణ, చిన్నారి (బాబురావు), సోయం కన్నరాజు, సోయం వెంకన్నబాబు, ఆదివాసి నాయకులు అరెమ్ ప్రశాంత్, కీసరి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక రవాణాకు చెక్.. రెండు లారీలు పట్టివేత..

**కోదాడ,జూలై 26(నినాదం):** కోదాడ రూరల్ పోలీసులు అక్రమ ఇసుక రవాణాపై కొరడా ఝుళిపించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ శివారులోని మున్నేరు వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, రవాణా పత్రాలు లేకుండా ఇసుకను హైదరాబాద్‌కు తరలిస్తున్న రెండు లారీలను రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై లారీ డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు కోదాడ రూరల్ ఎస్ఐ ఎస్.కె. యాకూబ్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణా వెనుక ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపై కూడా విచారణ చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. అక్రమ ఇసుక దందాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు, అనుమానాస్పదంగా ఇసుక రవాణా చేసే వాహనాలను తనిఖీ చేస్తామని పోలీసులు తెలిపారు.

# గ్రామపంచాయతీ కార్మికులలో మల్టీపర్పస్ వర్కర్స్. విధానాన్ని రద్దు చేయాల్సిందే

### గ్రామపంచాయతీ ఉద్యోగ ఉ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని డిమాండ్.





**ఖమ్మం జులై 26(నినాదం ):** గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల శ్రమ దోపిడీకి కారణమైన జీవో నెంబర్ 51 ని రద్దుచేసి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాల్సిందేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రఘునాధపాలెం లోని గణేష్ గార్డెన్ నందు జరిగినా తెలంగాణ రాష్ట్ర గ్రామపంచాయతీ ఉద్యోగ ఉ కార్మిక సంఘం (ఏఐటియుసి) 3 వ రాష్ట్ర మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలిత మహాసభల సూచికంగా ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ జెండాను ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ ఆవిష్కరించగా అనంతరం గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరీ నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన మహాసభలలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాలను కాపాడటంకై అనునిత్యం పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు అత్యధిక వేతనం ఇవ్వాల్సింది పోయి అత్యలప వేతనాలు ఇవ్వడం సరికాదు అన్నారు. కనీస వేతనం 26000గా ఇవ్వాలని అన్నికార్మిక సంఘాలు డిమాండ్ చేస్తుంటే పంచాయతీ కార్మికులకు 8500 రూపాయలు ఇవ్వడం ఏంటని ఆయన ప్రశ్నించారు. కనీస వేతన చట్టం కూడా నెలకు 16000 రూపాయలు ఇవ్వాలని చెబుతున్నా విషయాన్ని ఆయన గుర్తు చేశారు. త్వరలో అసంఘటితరంగా కార్మికులను సమన్వయపరిచి కనీస వేతనం కొరకు రాష్ట్రవ్యాప్త పోరాటం చేయనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు . పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. కొన్ని మేజర్ పంచాయితీలు కార్మికులకు ఎక్కువ వేతనాలు ఇచ్చే సమయంలో వాటిని కూడా ఇవ్వద్దని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడటం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికుల రక్తం పీల్చే జీవో నెంబర్ 51ని తొలగించి మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని హాయ్ రా ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, కొత్తగూడెం నగరం మేయర్ మూడు గణేష్, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. జి. క్లైమెంట్ , వెంకట రాజం జిల్లా కార్యనిర్వాక అధ్యక్షులు రావి శివరామకృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు రాష్ట్ర సమితి సభ్యులు సిహెచ్ సీతామహాలక్ష్మి, నిమ్మటూరి రామకృష్ణ, మల్లికార్జున్, గ్రామపంచాయతీ ఉద్యోగ ఉ కార్మిక సంఘం నాయకులు వాసిరెడ్డి మురళి, పిట్టల మల్లయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, రఘునా పాలెం మండల కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం అఖిలపక్ష నేతల సమావేశం

### హాజరైన రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్



**అమరచింత, జూలై 26, (నినాదం):** అమరచింత మండలం, వివిధ గ్రామాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు సంఘటితంగా ఉండాలని రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్ హైకోర్టు సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలోని దేశాయి మురళీధర్ రెడ్డి ప్రాథమిక పాఠశాలలో ఆదివారం వివిధ రాజకీయ పార్టీ నేతలు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దేశాయి ప్రకాష రెడ్డి మాట్లాడుతూ ఎంతో రాజకీయ చైతన్యం ఉన్న ఈ పట్టణం గ్రామాలు అభివృద్ధిలో మాత్రం కొంత వెనుక పడ్డట్లు ఆయన ఆయన పేర్కొన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని ఆ తర్వాత అభివృద్ధి పై ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. అనంతరం కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్ మాట్లాడుతూ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నుండి తప్పకుండా తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో ఇప్పటికే రూ ,121 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినా మని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇస్తా గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ దివంగత నేత సాయిచంద్ సతీమణి రజిని సాయి చంద్ మాట్లాడుతూ అమరశింతలో ఇంటర్మీడియట్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. వీటితోపాటు యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. అమరచింత అభివృద్ధిపై టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మునిసిపాలిటీ చైర్పర్సన్ జింక సువర్ణ రవి, వైస్ చైర్మన్ రాధా అరుణ్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు యువకులు విద్యావంతులు పాల్గొన్నారు.

## కేకే కమిటీ సభ్యుడు శోభన్ రెడ్డిని కలిసిన టీయుఎస్ ఎస్ నేతలు



ఎల్బీనగర్, జూలై 26,(నినాదం): తెలంగాణ ప్రభుత్వం నియమించిన కేకే ఉద్యమ కమిటీ సభ్యులు మోతె శోభన్ రెడ్డిని తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్ సన్, ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్న సమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఆదివారం శోభన్ రెడ్డి నివాసంలో కలుసుకున్న ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ, ప్రధాన కార్యదర్శి వెంకన్న లు ఉద్యమకారులతో నిర్వహించిన సమావేశాలు చారిత్రాత్మకంగా నిలిచి పోతాయి అన్నారు. సమావేశాలు ఉద్యమ స్ఫూర్తితో జరిగాయని ఉద్యమ కారుల సంక్షేమ సమితి సలహాదారులు ఉప్పు సుధాకర్, సమితి సభ్యులు జహంగీర్, శ్రీకాంత్, దాస్ లు శోభన్ రెడ్డికి వివరించారు.

**సమావేశాలు చారిత్రాత్మకంగా నిలిచి పోతాయి : మోతె శోభన్ రెడ్డి**

ఈ సందర్భంగా శోభన్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల వారితో సమావేశాలు నిర్వహించామని పేర్కొన్నారు. స్వల్ప వాగ్వాదాల మినహా సమావేశాలు సంపూర్ణంగా ముగిసాయని ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, సిఎం రేవంత్ రెడ్డి నిజమైన ఉద్యమ కారులకు ఖచ్చితంగా న్యాయం చేయాలనే దిశగా కేకే కమిటీ వేశారని ఆయన వివరించారు. జులై 6 నుంచి మొదలైన సమావేశాలు 23 తేదీ వరకు విజయవంతంగా జరిగాయి అన్నారు. తెలంగాణ తొలి మలి దశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న ఉద్యమ కారులు అందరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు దక్కే విధంగా కేకే కమిటీ కృషి చేస్తుందన్నారు. సుమారు 17 రోజుల పాటు జరిగిన సమావేశాల్లో 16 వేల మంది ఉద్యమ కారులు పాల్గొనగా ఒక వెయ్యి మంది ప్రసంగించారు అని శోభన్ రెడ్డి వివరించారు. భారత దేశంలో ఎన్నో రాష్ట్రాలు ఏర్పాటు అయ్యాయి కానీ ఉద్యమ కారులతో సుధీర్ఘంగా సమావేశాలు నిర్వహించి సలహాలు సూచనలు తీసుకున్న సందర్భాలు తక్కువ అన్నారు. వివిధ సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సలహాలు సూచనలను ప్రభుత్వం రికార్డు చేసిందని అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి ఉద్యమ కారులకు అనుకూలంగా తదుపరి కార్యాచరణ ఉంటుందన్నారు. నికార్సయిన ఉద్యమ కారులు ఎటువంటి అనుమానాలు అపోహలు పెట్టుకోవద్దని ప్రభుత్వం ఉద్యమ కారుల విషయంలో చిత్తశుద్ధితో ముందుకు పోతుంది అన్నారు. కేకే కమిటీ చైర్మన్ కే. కేశవరావు, సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్సీలు కోదండరాం సార్, అద్దంకి దయాకర్, రాములు నాయక్ తో కలిసి ఉద్యమ కారుల సమావేశాల నివేదికను త్వరలో ప్రభుత్వానికి, ప్రత్యేకంగా సిఎం రేవంత్ రెడ్డికి ఇవ్వడం జరుగుతుంది అని శోభన్ రెడ్డి తెలిపారు.

**శోభన్ రెడ్డికి హ్యాపీ జర్నీ చెప్పిన సమితి సభ్యులు**

ఆదివారం అమెరికా వెళుతున్న కేకే కమిటీ సభ్యులు మోతె శోభన్ రెడ్డికి తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్ సన్, ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్న అలియాస్ తెలంగాణ వెంకన్న, సలహాదారులు ఉప్పు సత్యనారాయణ, సభ్యులు జహంగీర్, శ్రీకాంత్, దాస్ లు హ్యాపీ జర్నీ చెప్పారు.

## పంచాయతీ, నుండి పార్లమెంటు స్థాయి వరకు, జనసేనను బలోపేతమే లక్ష్యం

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తళ్ళూరి, ఆర్ కే సాగర్,

### జనసేన జాయినింగ్ కమిటీ సభ్యులు చిరాజ్ ప్రజిత్ గౌడ్, తనూజారెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్లలో జనసేన ఆత్మీయ సభ.



**చేవెళ్ళ జులై 26( నినాదం):** గ్రామస్థాయి నుంచి, పార్లమెంట్ స్థాయి వరకు జనసేన ను బలో పేత చేయడమే లక్ష్యమని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తళ్లూరి, ఆర్కే సాగర్, స్టార్ కంపెనీయర్ తనిష్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా శనివారం చేవెళ్ల పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల సమావేశంను జనసేన జాయింట్ కమిటీ సభ్యులు సిరాగ్ ప్రజీద్ గౌడ్, తనుజ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామ్ తాళ్లూరి, ఆర్కె సాగర్, తనీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యమని అన్నారు.. రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలలో జనసేనా పార్టీ పోటీకి సిద్ధంగా ఉందనిఅన్నారు.. గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేస్తామని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి అన్నారు. తెలంగాణ ప్రజలు ఆకాంక్షమేరకు నవ తెలంగాణ సాధించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో జనసేన ఏర్పాటైందని, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో 6 వేల వరకు పార్టీ సభ్యత్వాల నమోదైందని, పార్టీ భావజాలం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన అజెండా అని వెల్లడించారు. తెలంగాణ యువత పెద్ద ఎత్తున రాజకీయాల్లోకి రావాలని, యువతే రాజకీయ వ్యవస్థలో మార్పుకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. ఎన్నో సంవత్సరాలుగా కుటుంబ వారసత్వ రాజకీయాల వల్ల ప్రజలకు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్నవారే రాజకీయాల్లోకి రావాలని, ప్రజలు కోరుకున్న మార్పు వచ్చేవరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని అన్నారు.. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణపై ప్రత్యేక ప్రేమ, అభిమానం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఆయన గతంలోనే ప్రశ్నించారని, ప్రజల తరఫున నిరంతరం గొంతెత్తుతున్న నాయకుడిగా ఆయన నిలిచారని కొనియాడారు. రాబోయే రోజుల్లో గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ చేపడతామని, ప్రతి గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటామని తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు తగిన ప్రాధాన్యతతో పాటు గుర్తింపు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ తెలంగాణ అభివృద్ధి కోసం జనసేన పార్టీ తన ఉద్యమాన్ని మరింత విస్తృతంగా కొనసాగిస్తుందన్నారు.. అనంతరం యువకులు జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రచార కార్యదర్శి ఆర్. కే సాగర్, స్టార్ క్యాంపెయినర్ తనీష్ అల్లాడి, రాష్ట్ర నాయకులు మచ్చా సుధాకర్, ముమ్మారెడ్డి, ప్రేమ్ కుమార్, మేకల సతీష్ రెడ్డి, మీసాల శ్రీనివాసరావు, గడల శ్రీనివాసరావు, రామకృష్ణ మిరియాల, శిరీష పొన్నూరు, దామోదర్ రెడ్డి, సురేష్ రెడ్డి, గుడిబండ రవి, జాగీర్దర్ (కర్ణాటక), ప్రేమ్ గాంధీ, చేవెళ్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## అమరులైన కార్గిల్ వీర జవాన్‌లకు ఘన నివ్వాళ్ళు

### సయ్యద్ మోహినుద్దీన్ బీజేపీ మైనారిటీ నాయకులు.



**పాలేరు జులై 26( నినాదం):** కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్లకు నివాళులర్పిస్తున్నట్లు బీజేపీ మైనారిటీ జిల్లా నాయకులు సయ్యద్ మోహి నుద్దీన్ పేర్కొన్నారు మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన... మాట్లాడు తూ..భారత సైన్యం యొక్క ధైర్యసాహ సాలు, త్యాగానికి ఇది ప్రతీక కార్గిల్ దివస్ 1999లో లడఖ్‌లోని కార్గిల్, ద్రాస్ సెక్టార్లలో భారత భూభాగాన్ని అక్రమంగా ఆక్రమించిన పాకిస్తాన్ సైనికులను మరియు తీవ్రవాదులను వెనక్కి తరిమికొట్టడానికి భారత సైన్యం 'ఆపరేషన్ విజయ్' ప్రారంభించింది అని,మే 1999లో ప్రారంభమైన ఈ యుద్ధం దాదాపు 60 రోజుల పాటు కొనసాగింది. జూలై 26, 1999న భారత సైన్యం పాకిస్తాన్ బలగాలను పూర్తిగా తరిమేసి, కార్గిల్ శిఖరాలపై మన త్రివర్ణ పతాకాన్ని తిరిగి ఎగురవేసింది అన్నారు ఈ యుద్ధంలో దాదాపు 527 మందికి పైగా భారత సైనికులు దేశరక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించారని,దేశం కోసం పోరాడి అమరులైన ఆ వీర జవాన్ల త్యాగాలను స్మరించుకోవడానికి ప్రతీ సంవత్సరం జులై 26 న నివాళులు అర్పిస్తారని కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఢిల్లీలోని నేషనల్ వార్ మెమో రియల్ వద్ద, అలాగే ద్రాస్‌లోని 'కార్గిల్ వార్ మెమోరియల్' వద్ద ప్రధానమంత్రి, రక్షణ మంత్రి మరియు సైనిక దళాల అధిపతులు అమరవీరులకు అంజలి ఘటిస్తారని,భారతమాత రక్షణ కోసం పోరాడిన మన సైనికుల దేశభక్తిని, శౌర్యాన్ని ప్రతి ఒక్కరికీ గుర్తుచేసే పవిత్రమైన రోజు ఇది అన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో మౌలిక వసతులేవి?

### ఆసుపత్రిని పరిశీలించిన ఎస్ఎఫ్ ఐ, డివై ఎఫ్ ఐ సంఘాల నాయకులు



**కొడంగల్, జులై 26(నినాదం):** కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వసతులు కరువయ్యాయని, సరిపడా డాక్టర్లు సిబ్బంది లేరని ఎస్ ఎఫ్ ఐ సంఘం నాయకులు అనిల్ కుమార్, డివైఎఫ్ రైతు సంఘం నాయకులు ఆర్ మైపాల్ ఆరోపించారు. ఈసందర్భంగా ఆసుపత్రికి వెళ్లి తనిఖీ చేశారు. డాక్టర్ సాకేత్ తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఆసుపత్రిలో మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యం లేదని,సరిపడా వైద్య సిబ్బంది లేరని,బ్లడ్ బ్యాంకు అందుబాటులో లేదని,ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్ లేదని ఆరోపించారు. సరిపడా డాక్టర్ల ను, వైద్య సిబ్బంది ని నియమించాలని, త్రాగునీటి, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, ఎంఆర్ ఐ సిటీ స్కాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ వేతనాలు ఇవ్వాలని ఈఎస్ ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని,ఆసుపత్రి దగ్గర పోలీసు సెక్యూరిటి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో డివైఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి సతీష్, ఉపాధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 4న 'ఛలో జల భవన్'

### ప్రభుత్వ నిర్లక్ష్యంతో రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన

### తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఓరుగంటి రమణారావు



**కరీంనగర్, జులై26(నినాదం):** ఉద్యోగ విరమణ చేసిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు రావాల్సిన వేతన సవరణ బకాయిలు, ఇతర ఆర్థిక ప్రయోజనాల చెల్లింపుపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని, లేకపోతే ఆగస్టు 4న హైదరాబాద్‌లోని జలభవన్ వద్ద 'ఛలో జల భవన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కరీంనగర్ జోన్ (ఉత్తర తెలంగాణ) గౌరవ అధ్యక్షుడు ఓరుగంటి రమణారావు హెచ్చరించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని తారక్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జోనల్ అధ్యక్షుడు గంగాధర్, రాష్ట్ర అధ్యక్షుడు రాజయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, రాష్ట్ర నాయకులు సుధాకర్, రత్నం, చంద్రయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు దశాబ్దాల పాటు కష్టపడి ప్రజా రవాణా సేవలకు తమ జీవితాన్ని అంకితం చేసినప్పటికీ, వారి పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని రమణారావు విమర్శించారు. 2017లో అమలు కావాల్సిన వేతన సవరణను 2024లో, 2021లో జరగాల్సిన మరో వేతన సవరణను 2026లో అమలు చేయడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొన్నారని తెలిపారు. గత మూడు నెలలుగా ఆర్టీసీ యాజమాన్యాన్ని పలుమార్లు కలిసి సమస్యలను వివరించినప్పటికీ, హామీలు అమలు కాలేదని చెప్పారు. ఉద్యోగుల జీతాల నుంచి మినహాయించిన నిధులతో నడుస్తున్న తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిలో కూడా రిటైర్డ్ ఉద్యోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 వేల మంది రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు వేతన సవరణ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ఒక్కో ఉద్యోగికి సగటున రూ. 8 లక్షల వరకు రావాల్సి ఉందన్నారు. ఈ బకాయిలు అందకుండానే ఇప్పటికే 300 మందికి పైగా ఉద్యోగులు మరణించారని పేర్కొన్నారు. గతంలో ఉద్యోగులకు లగ్జరీ, సూపర్ లగ్జరీ, సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉన్న ఉచిత, రాయితీ ప్రయాణ సౌకర్యాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 'మహాలక్ష్మి' పథకం ద్వారా ఆర్టీసీకి ఆదాయం పెరుగుతోందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, రిటైర్డ్ ఉద్యోగుల న్యాయమైన బకాయిలను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే బకాయిల చెల్లింపుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని, లేకపోతే ఆగస్టు 4న జలభవన్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న రిటైర్డ్ ఉద్యోగులకు ఏవైనా ఇబ్బందులు లేదా ప్రాణనష్టం జరిగినా అందుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

సోమవారం । తెలంగాణ
27 జులై 2026

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## గొడుగు ఎల్లయ్యను పరామర్శించిన మాజీ మంత్రి



**వనపర్తి ప్రతినిధి, జులై 26 (నినాదం):** వనపర్తి మండలం రాజపేట గ్రామ సర్పంచ్‌గొడుగు ఎల్లయ్య మాతృమూర్తి గొడుగు చెనమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈవిషయం తెలుసుకున్న మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిఆదివారం వారి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగానివాళు లర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని వారికి మనోధైర్యాన్నికల్పించారు. మాజీ మంత్రి వెంట సింగల్ విండో అధ్యక్షులు రఘువరన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ధర్మనాయక్, మాధవరెడ్డి, సుదర్శన్ రెడ్డి, రైతు సమితిఅధ్యక్షులు దేవర్ల నరసింహ, డేగ మహేశ్వర్ రెడ్డి, సంపత్ కుమార్ రెడ్డి, చిట్యాల రాము, సుధాకర్ గౌడ్ తదితరులు ఉన్నారు

## దశదిన కర్మలో పలువురు సర్పంచులు.



**ధర్మారం జులై 26 (నినాదం) :**మండలంలోని నర్సింహులపల్లి గ్రామ సర్పంచ్ ఆవుల మల్లయ్య మాతృమూర్తి లక్ష్మవ్వ దశదినకర్మలో ఈరోజు పలువురు గ్రామ సర్పంచులు పాల్గొని తోటి సర్పంచ్ కు మనో ధైర్యాన్ని వారి కుటుంబానికి నింపారు. చనిపోయిన లక్ష్మమ్మ కు ముగ్గురు కుమారులు, ఆవుల మల్లయ్య శంకరయ్య ఎల్లయ్య, కాగా ఆవుల మల్లయ్య జరిగిన ఎన్నికల్లో నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో బంజరు పల్లె సర్పంచ్ గంగారెడ్డి, ఎర్ర గుంటపల్లి మాజీ సర్పంచ్ కొత్త నరసింహులు కొండగట్టు మాజీ డైరెక్టర్ జక్కుల దామోదర్ రావు, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, వేల్పుల రేవతి నాగరాజు నందాల మల్లేశం చేపూరి లచ్చయ్య యాదవ సంఘం నాయకులు పవన్ కుమారస్వామి లక్ష్మణ్ తదితరులు పాల్గొని, చిత్రపటానికి నివాళులు అర్పించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హులైన ఓటరు పాల్గొనాలి

36,37 డివిజన్లలో ఎస్ఐఆర్ అవగాహన ర్యాలీ




కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ

**నిజామాబాద్ ప్రతినిధి, జులై 26 (నినాదం) :** ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హులైన ఓటరు భాగస్వామ్యం కావాలని, ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సకాలంలో సమర్పించి ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. ఆదివారం 36,37 డివిజన్లలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐఆర్ అబ్జర్వర్ గన్ రాజ్ పర్యవేక్షణలో, బండారి రమేష్ సమన్వయంతో 36వ డివిజన్ ఇంచార్జ్ విక్కీ యాదవ్, 37వ డివిజన్ ఇంచార్జ్ కరిపే శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ హాజరయ్యారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి స్థానికులను కలుస్తూ ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌లకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. అలాగే ప్రజలు తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సంబంధిత బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ)కు అందజేశారా లేదా అనే విషయాన్ని తెలుసుకుని, అవసరమైన వారికి మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రం గంగాధర్, 38వ డివిజన్ కార్పొరేటర్ ప్రవీణ్ యాదవ్,కోఆప్షన్ సభ్యులు బొబ్బిలి మాధురి మురళి, ఈఆర్ఓ కోఆర్డినేటర్ వహీద్, ధాత్రిక భాస్కర్, ఆకుల వెంకటేష్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.ద

## టీజీవో ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోనాల పండుగ



**నిజామాబాద్ ప్రతినిధి,జులై 26 (నినాదం) :** నిజామాబాద్ నగరంలోని పాత కలెక్టరేట్ లోని వనదుర్గాదేవి ఆలయంలో టీజీవో ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై బోనంను ఎత్తుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేధన్ పాల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం టీజీవో ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో బోనాల కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాగోళ్ళ లక్ష్మీనారాయణ, శశాంక్ రెడ్డి, టీజీవో ఎంప్లాయిస్ అధ్యక్షులు అలుక కిషన్, అమృత్ కుమార్, పెద్దోళ్ళ నాగరాజు, నారాయణ, ఆకుల ప్రసాద్, దాస్, సత్యం, చందు పాల్గొన్నారు.

## కోదాడ కుమ్మరి సంఘ ఇన్‌చార్జిగా చలిగంటి రామారావు



**కోదాడ,జూలై 26(నినాదం):**జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఏకగ్రీవంగా ఎన్నికైన చలిగంటి రామారావును రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ మండలాల నుంచి హాజరైన కుమ్మరి సంఘ సభ్యులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం బలోపేతం, కుమ్మరి వృత్తిదారుల సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్, గరిడేపల్లి, నేరేడుచర్ల, మఠంపల్లి తదితర మండలాల సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# మరిపెడలో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

అమరవీరులకు ఘన నివాళి.

కార్గిల్ సొసైటీ ఛైర్మన్ గాదె రాంబాబు



**దోర్నకల్/మరిపెడ జులై 26 (నినాదం):**మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణంలోని కార్గిల్ సెంటర్‌లో ఆదివారం రోజున కార్గిల్ విజయ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికిమరిపెడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ) పవన్,మరిపెడ పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ)సతీష్‌ముఖ్య అతిథులుగా హాజరై కార్గిల్ యుద్ధంలోఅమరులైన భారత సైనికులకు పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ సీతారాం నాయక్ మాట్లాడుతూ, 1999లో కార్గిల్‌యుద్ధంలో పాకిస్తాన్ చొరబాటుదారులను సమర్థవంతంగా తిప్పికొట్టి భారత సైన్యం జూలై 26న చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. దేశ సార్వభౌమత్వాన్ని,భద్రతను కాపాడేందుకు ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ల సేవలను భారతదేశం ఎన్నటికీ మరువదు. వారి త్యాగమే ఈరోజు మనం స్వేచ్ఛగా బతకడానికి కారణం అని అన్నారు. కార్గిల్ సొసైటీ ఛైర్మన్ గాదె రాంబాబు మాట్లాడుతూ,కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికుల త్యాగస్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం. దేశభక్తి,క్రమశిక్షణ, సేవాభావంతో ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలి. మనం వారికి ఇచ్చే అసలైన నివాళి అదే అనిపిలుపునిచ్చారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ ఛైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, భారత సైన్యం దేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. కార్గిల్ విజయం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఘట్టం. ప్రతి ఇంట్లోనూ ఈ విజయ గాథను పిల్లలకు చెప్పాల న్నారు. కాంగ్రెస్ నాయకులు నూకల అభినవ్ రెడ్డి, రామ్ లాల్, బీజేపీ నాయకులు భూక్యా దేవిక శంకర్ నాయక్, సుధాకర్ నాయక్ పాల్గొని నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు, యువకులు, విద్యార్థులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్గిల్ అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. చివరగా 2 నిమిషాల మౌనం పాటించి అమరజవాన్లకు నివాళులు అర్పించారు...

## అక్రమ మట్టి తవ్వకాలు నిలిపి వెయ్యమంటే...

# ప్రభుత్వ రోడ్డును ధ్వంసం చేస్తారా...

నేనే మట్టి తోలకం చేయాలి ఇతర వాహనదారులను హెచ్చరిస్తున్న అంజయ్య..

అంజయ్యకు అండగా ఉన్న ప్రజాప్రతినిధి ఎవరు..?

ఎంపీడీవో, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు విచారణ చేయాలి

ప్రభుత్వ రోడ్డును ధ్వంసం చేసిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి రైతుల డిమాండ్

**ఇల్లందు,జులై 26,(నినాదం ) :** అక్రమమట్టి వ్యాపారం కాస్త ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం వరకు దారితీసింది. మట్టితోల కాలు మా ప్రాంతం నుండి జరుపవద్దని రాజీవ్ తండావాసులు సదరు మట్టి వ్యాపారి వీరబోయిన అంజయ్య అలియాస్ అంజిని హెచ్చరించారు. వారి హెచ్చరికల తో ఆగ్రహావేశాలు గురైన అంజి అదే ప్రాంతంలో వ్యవసాయం చేసుకునే రైతులు పొలాలకు వెళ్లేందుకు ప్రభుత్వం ఎన్. ఆర్. ఇ. జి. ఎస్ లక్షల రూపాయలు వెచ్చించి రోడ్డు నిర్మాణ పనులు చేపడితే ఆ రోడ్డు నిర్మాణ పనులను తన జెసిబి సహకారంతో ధ్వంసం చేశారు. దీంతో కొంత ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకోవడమే కాకుండా చివరికి అక్రమ మట్టి వ్యాపారి ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి తెగబడటం బెదిరింపులకు పాల్పడటం అడ్డొచ్చిన వారిని అంతు చూస్తానని బెదిరించటం వరకు చేరుకుంది...

**గ్రామస్తుల రైతుల ఆవేదనలి**

ఇల్లందు – కారేపల్లి సరిహద్దుల నుంచి తనకున్న లారీలు ట్రాక్టర్లు వినియోగించి సీఎస్పీ బస్తీ రాజీవ్ నగర్ గ్రామం మీదుగా సిఎస్పి గ్రామం మీదుగా అక్రమంగా మట్టి తోలకాలు జరుపుతున్నారు. ఈ మట్టి తోలకల సమయంలో గాలికి దుమ్ము దూళి లేచి రోడ్డు ప్రక్కనే ఉన్న తమ ఇండ్ల లోకి వచ్చి చేరుతుందని, దీని ద్వారా అనారోగ్యానికి గురవుతున్నామని, అక్రమ మట్టి తోలకాలు జరుపుతున్న వ్యక్తులను ఆ మార్గం వెంట ఉన్న రాజీవ్ నగర్ ప్రజలు సీఎస్పీ బస్తి వాసులు మా ప్రాంతాల మీదుగా మట్టిని తీసుకువెళ్లే వాహనాలను తీసుకురావద్దని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని సదరు మట్టి వ్యాపారి అంజయ్య హెచ్చరించారు. వారి హెచ్చరికలతో అక్కసు ఆగ్రహం పెంచుకున్న అంజయ్య ఆ ప్రాంతంలో వ్యవసాయం చేసుకునేందుకు రైతులకు సులువుగా ఉండే రోడ్డు మార్గాన్ని నిర్మిస్తే ఆ రోడ్డు మార్గాన్ని తన జెసిబి సహకారంతో ధ్వంసం చేశారని రైతులు మాజీ సర్పంచ్ రవి వెల్లడించిన విషయం విధితమే. మట్టి తోలకాలను నిలిపివేయాలన్నందుకు ఏకంగా రైతులకు మేలు రోడ్డును ధ్వంసం చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి ఎన్ఆర్ఈజీఎస్ కింద రైతుల పొలాలకు వెళ్లే సమయంలో ఎరువులు పురుగు మందులు పంట పండించిన తర్వాత పంటను తిరిగి తీసుకొచ్చుకునేందుకు సులువుగా ఉండే అలా అన్న ఉద్దేశంతో అప్రోచ్ రోడ్లను నిర్మించింది. ఈ రోడ్డును కాస్త అక్రమ మట్టి వ్యాపారి అంజయ్య ధ్వంసం చేయడం ప్రభుత్వ ఆస్తిని నష్టపరచడమేనని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఈ మట్టితోలకాల రవాణాను మా ప్రాంతం నుండి జరగకుండా చూడాలని మా ఆరోగ్యాలను ప్రాణాలను కాపాడాలని రైతుల కోసం నిర్మించిన రోడ్డు మార్గాన్ని పునర్నిర్మించి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాధికారులను వేడుకుంటున్నారు.

**అక్రమం మట్టి వ్యాపారి అంజికి అండగా ఉన్న ప్రజాప్రతినిధి ఎవరులి..?**

గత కొన్ని నెలలుగా అక్రమ మట్టి వ్యాపారం కొనసాగిస్తూ రోజుకి రూ 80,000 నుండి లక్ష రూపాయలు ఆర్జిస్తున్న అక్రమ మట్టి వ్యాపారి వీరబోయిన అంజయ్య అలియాస్ అంజి అండ్ కో అక్రమ వ్యాపార బృంద రంజీ, డైరెక్టర్ కృష్ణవంశీల ధైర్యాల సాహసాలకు అండగా ఉంటున్న ప్రజాప్రతినిధి ఎవరు అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారులు ప్రజలు ప్రశ్నించిన ప్రతిసారి మా వెనుక పెద్ద ప్రజాప్రతిని ఉన్నారు, సహకారం అండదండలతోనే ఈ వ్యాపారం చేస్తున్నామని ఇటు ప్రజలను, చిన్న ప్రజా ప్రతినిధులను అధికారులను బెదిరిస్తున్న వైనం వీరిది. ఇంత పెద్ద మొత్తంలో రోజు రూ 80 వేలకు పైగా సంపాదన ఆర్జిస్తున్న ఈ వ్యాపారస్తుడికి ఎవరో పెద్ద ప్రజా ప్రతినిధి అండదండలు ఉండి ఉంటాయని, ఆ ధైర్యం చూసుకొని ఈ అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నాడని వాపోతున్నారు. అధికారులు సైతం అంజి మట్టి తోలకాల నిలువరించలేకపోతున్నారంటే పెద్ద



రోడ్డు ధ్వంసం చేసిన దృశ్యం

ప్రజా ప్రతినిధి అభయాసం ఇస్తున్నట్లు బాధిత ప్రజలు రైతులు వాపోతున్నారు. ఇది ఇలా ఉంటే ఇల్లందులో మట్టి తోలకం తానే జరపాలని, మరే ఇతర వాహనాలల్లో మట్టి తోలకం జరుగుతున్నట్లు కనిపిస్తే తక్షణమే అధికారులకు పట్టిస్తామని రెండు రోజుల క్రితం సొంత అవసరాల నిమిత్తం మట్టి కొనుగోలు చేసుకుని వస్తున్న కొందరు ట్రాక్టర్ యజమానులను బెదిరింపులకు గురిచేసినట్లు తెలిసింది. మట్టి వ్యాపారం అంజికి ఏమైనా పేటెంట్ హక్కు ఎవరు ఈ మట్టి వ్యాపారానికి ఆయనకు అనుమతులు ఇచ్చారు అనే అంశాన్ని సైతం రెవెన్యూ ఫారెస్ట్ ఇతర శాఖ అధికారులు తేల్చి చెప్పాలంటూ ఇటు ప్రజలు మట్టితోలకానికి వినియోగించే ట్రాక్టర్ యజమానులు అధికారులను వేడుకుంటున్నారు ఈ విషయమై తాము కలెక్టర్ ను సైతం కలిసేందుకు సిద్ధమవుతున్నట్లు వాపోయారు.

**ఎంపీడీవో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు విచారణ చేయాలిలి...**

మండలంలోని సీఎస్పీ బస్తీ పంచాయతీ రైతులకు ఉపయోగపడే విధంగా ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన అప్రోచ్ మట్టి రోడ్డు నిర్మాణాన్ని ధ్వంసం చేసిన సంఘటన పైన ఎంపీడీవో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు తక్షణమే విచారణ చేపట్టి ఈ విధ్వంసానికి పాల్పడిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిమానా రూపంలో ప్రభుత్వానికి జరిగిన నష్టపరిహారాన్ని వసూలు చేయాలని ఆ ప్రాంత రైతులు మాజీ సర్పంచ్ రవి డిమాండ్ చేశారు.

**ప్రభుత్వ రోడ్డు ధ్వంసం చేసిన అంజి పై క్రిమినల్ కేసు నమోదు చేయాలిలి....**

రైతులకు ఉపయోగపడే విధంగా ఎన్ఆర్ఈజీఎస్ కింద లక్షల రూపాయలు ఇచ్చి అప్రోచ్ రోడ్డు నిర్మిస్తే ఆ రోడ్డును వీరబోయిన అంజయ్య అలియాస్ అంజి ధ్వంసం చేశారని రైతులు సీఎస్పీ బస్తి మాజీ సర్పంచ్ రవిలు తెలిపారు. తక్షణమే దీనిపై ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు ఎంపీడీవోలు పరిశీలించి ఈ విధ్వంసానికి పాల్పడిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేసి నష్టపరిహారాన్ని జరిమానా రూపంలో వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వ ఆస్తి ధ్వంసానికి సంబంధించిన విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం తీసుకువెళ్లనున్నట్లు రైతులు గ్రామస్తులు తెలిపారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని శివుడికి ప్రత్యేక పూజలు

సుర సముద్రం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన కౌన్సిలర్ పాపిశెట్టి రాము

**ఆమనగల్లు, జులై 26(నినాదం):**రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ప్రముఖ సంఘ సేవకులు, అరవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు, ఐదవ వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ఆదివారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని సుర సముద్రం వద్ద శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో చిత్తరంజన్ దాస్, శ్రీను నాయక్, వడ్డేమోని శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

బిజెపి జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ



**వనపర్తి ప్రతినిధి, జులై 26 (నినాదం):** విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయంలోఫీజుల బకాయిలు, బీజేపీ లడాయి అనే పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 15,000కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల విద్యాభవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు కళాశాలల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరీక్షలు రాయడంలో, సర్టిఫికెట్లు పొందడంలో, ఉన్నత విద్యను కొనసాగించడంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఫీజుల బకాయిలు, బీజేపీ లడాయి ఉద్యమాన్ని చేపట్టిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల కోసం బీజేపీ నిరంతరం విద్యార్థుల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుల శ్రీశైలం, రామన్న గారి వెంకటేశ్వర్లు, జిల్లాప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, జిల్లా కార్యదర్శి మనీ వర్ధన్, జిల్లా అధికార ప్రతినిధి నక్కమహేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు కొమ్ము శ్రీనివాసులు, గోపీనాథ్, యువ మోర్చా నాయకులు శివ, రాజేష్, రవి, చందు, నవీన్ తదితరులు పాల్గొన్నారు

## లారీ ఢీకొని యువకుడు మృతి, మరో ఇద్దరికి గాయాలు



**మిర్యాలగూడ జులై 26(నినాదం ):**మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ శివారు జంకుతండా ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం లారీ ఢీకొని బైక్ పై వెళ్తున్న ఓ యువకుడు మరణించగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని బాపూజీ నగర్ కు చెందిన గుడుగుంట్ల విజయ్ ప్రసాద్ (31) తన స్నేహితుడైన కొండ అజయ్ బైకుపై కోదాడ – జడ్చర్ల హైవేపై వెళ్తూ బైక్ నడుపుతున్న అజయ్ లారీని ఓవర్ టేక్ చేసి జంకుతండా వైపు వెళ్లేందుకు మలుపు తిరుగుతుండగా వెనక నుండి అతివేగంగా వచ్చిన లారీ బైకును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో విజయ్ ప్రసాద్ అక్కడికక్కడే మరణించగా, అజయ్, మరో యువకుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ గొల్ల ప్రకాష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ ఎం లక్ష్మయ్య తెలిపారు.

## ట్రాక్టర్ బోల్తా యువకుడు దుర్మరణం..



**దమ్మపేట, జులై 26(నినాదం):** మండల పరిధిలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామానికి చెందిన బెజవాడ ప్రేమ్ కుమార్ (30) ట్రాక్టర్‌పై దమ్మపేట కు వస్తుండగా మొండివర్రె గ్రామం సమీపం లోని సీతారాం ప్రాజెక్టు కాలువ వంతెన వద్దకు రాగానే అకస్మాత్తుగా అదుపుతప్పింది. తీవ్ర వేగంతో ఉన్న ట్రాక్టర్ ఒక్కసారిగా రహదారి పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో భారీ వాహనం కింద నలిగిపోయిన ప్రేమ్ కుమార్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమ్మిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమా లేక సాంకేతిక లోపం అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చేతికి అందిన కొడుకు అకాల మరణం చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ ఘటనతో బుగ్గపాడు గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఆధారం కావలసిన యువకుడు రోడ్డు ప్రమాదానికి బలికావడంతో భార్యాపిల్లల రోదనలు స్థానికులను కన్నీరు పెట్టించాయి.

## లక్ష్మీతాండలో వ్యక్తి దారుణ హత్య



**గోపాల్ పేట, జులై 26 (నినాదం):** గోపాల్ పేట మండలం బుద్దారం లక్ష్మీతాండ గ్రామ పంచాయతీలో ఆదివారం దారుణహత్య జరిగింది. గ్రామానికి చెందిన మెగ్యానాయక్ ను గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మధ్యాహ్నం పక్కింటి వారు ఇంటికి వెళ్లిపలుమార్లు పిలిచినా స్పందన లేకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా ఆయన రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉండటం గమనించి వెంటనే గ్రామస్తులకు సమాచారంఅందించారు. గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మెగ్యానాయక్ గొంతు కోసి హత్య చేసినట్లు గుర్తించి వెంటనే గోపాల్ పేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకునిమృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం, ఫోరెన్సిక్ సిబ్బందికి సమాచారం ఇచ్చి ఆధారాలు సేకరించే ప్రక్రియ చేపట్టారు. మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికిఇద్దరు కుమారులు ఉండగా, భార్య గతంలోనే మృతి చెందినట్లు స్థానికులుతెలిపారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్నపోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. హత్యకు గల కారణాలు,నిందితుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది

## యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి



**పాలకవీడు,జూలై 26(నినాదం):**యూరియా యాప్ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, దానిని వెంటనే రద్దు చేసి పీఏసీఎస్‌ల ద్వారా యూరియా పంపిణీ చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. పాలకవీడులో ఆయన మాట్లాడుతూ, రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యుడు కత్తి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు

## రక్తదానం చేసిన కౌన్సిలర్ మోర్ శ్రీకాంత్



**వైరా, జులై 26 (నినాదం ):** ఎమ్మెల్యే మాలోత్ రాం దాస్ నాయక్ జన్మదినం సందర్భంగా వైరాలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఒకటవ వార్డు కౌన్సిలర్ మోర్ శ్రీకాంత్ రక్తదానం చేశారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం చేయటం వల్ల మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. రక్తదానం చేసిన కౌన్సిలర్ శ్రీకాంత్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఒకటో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

